సాక్షి
చిత్తూరు
మంగళవారం ‌। 24 ‌। డిసెంబర్ ‌। 2024



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్..
రొంపిచెర్ల మండలానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు గురుస్వామి తెలుగు బుక్ ఆఫ్ రికార్డును సాధించారు.
- 8లో



గోకులం.. పసుపుమయం
రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తూ పసుపు రంగులు వేస్తున్నారు.
- 8లో




దుకాణం దివాలా!
గత ఆరు నెలలుగా జిల్లాలో వ్యాపారాలు ఆశించినంత మేర జరక్కపోవడంతో దుకాణాలు దివాలా తీస్తున్నాయి.
- 8లో

అక్షరం.. అంధకారం

నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని మండలాల్లో నిరక్షరాస్యులను ఎంపిక చేసి వారందరికీ రాత్రి పూట బడులు నిర్వహించాల్సి ఉంది. దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని నెల క్రితం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆయా శాఖల అధికారులతో సమావేశమై ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. అయితే ఈ కార్యక్రమం ఇప్పటివరకూ జిల్లాలో ఎక్కడా నిర్వహించడం లేదు. రాత్రి బడుల మాటే వినిపించడం లేదు. అక్షరాలు నేర్పించేవారూ లేరు. ఉల్లాస్ కార్యక్రమం అమలు తీరుపై కలెక్టర్ ఆదేశాలు పట్టించుకునే దిక్కు లేదు. దీంతో ఉల్లాస్.. ఉఫ్ అంటూ నీరుగారిపోతోంది.





- జిల్లాలో కానరాని రాత్రి బడులు
- ఉసూరుమంటున్న 'ఉల్లాస్'
- అక్షరాస్యత తూతూమంత్రం
- పర్యవేక్షణలో విఫలమైన యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 32 మండలాలున్నాయి. రెవెన్యూ గ్రామాలు 822, గ్రామ పంచాయతీలు 697 ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం జనాభా 18.73 లక్షల జనాభా ఉండగా, పురుషులు 9.4 లక్షలు, మహిళలు 9.33 లక్షలున్నారు. అర్బన్‌లో 3.69 లక్షలు, రూరల్ లో 15.04 లక్షల జనాభా ఉన్నారు. ఈ జనాభాలో 11.80 లక్షల మంది అక్షరాస్యులుండగా, పురుషుల అక్షరాస్యత శాతం 78.33, మహిళల అక్షరాస్యత శాతం 60.32గా ఉంది. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు నిర్వహించాల్సిన 'ఉల్లాస్' పక్కదారి పడుతోంది. క్షేత్రస్థాయిలో ఆశించిన మేరకు ఈ కార్యక్రమం అమలు కాకపోవడం వల్ల ఉల్లాస్ ఆశయం నీరుగారుతోంది.

నేటి సాంకేతికతపై పట్టు ముఖ్యం

గతంతో పోల్చితే ప్రస్తుతం సాంకేతికత చాలా అభివృద్ధి చెందింది. ఈ సాంకేతికతకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత రోజుల్లో పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసినా డిజిటల్, సాంకేతికత, నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయి. పొదుపు సంఘాల్లోని మహిళలు ఇవన్నీ నేర్చుకోవడం చాలా ముఖ్యం. సాంకేతికతపై పట్టు లేకపోతే సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఉల్లాస్ కార్యక్రమంలో నేటి సాంకేతికతపై అవగాహన కల్పిస్తే పొదుపు సంఘాల మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం నామమాత్రంగా సాగుతుండడంతో ఉల్లాస్ ఆశయం నెరవేరదని విద్యావేత్తలు వెల్లడిస్తున్నారు.

తరగతులు నిర్వహించాల్సిందే

ఉల్లాస్ కార్యక్రమం జిల్లాలో మూడేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ప్రతి ఆరు నెలలకు ఒక బృందానికి పాఠాలు బోధిస్తారు. ఆరు నెలల్లో 200 గంటల పాటు తప్పనిసరిగా తరగతులు నిర్వహించాలని నిబంధనలు ఉన్నాయి. ఆ తరగతుల్లో ఆర్థిక, సామాజిక, డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు అభ్యసన తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్య ప్రతి రోజు తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.

జిల్లాలో నిరక్షరాస్యులు 9,078 మందే

వయోజన విద్య, డీఆర్‌డీఏ, విద్యాశాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ శాఖల పరిధిలో జిల్లాలో 9,078 మంది మాత్రమే నిరక్షరాస్యులున్నట్లు గుర్తించారు. వాస్తవంగా అంతకంటే ఎక్కువ మందే జిల్లాలో నిరక్షరాస్యులుంటారు. అయితే నిరక్షరాస్యులను గుర్తించడంలో అలసత్వం వహించడం వల్ల తూతూమంత్రంగా నిర్వహించి, అధికారులు చేతులు దులుపుకున్నారు. జిల్లాలో లక్షలాదిమంది నిరక్షరాస్యులుంటే కేవలం 9,078 మందిని మాత్రమే గుర్తించడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా పర్యవేక్షించాల్సిన ఆయా శాఖల అధికారులు విఫలమయ్యారని తెలుస్తోంది.



ఉల్లాస్ కార్యక్రమం వెబ్‌సైట్ చిత్రం


ఉల్లాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు (ఫైల్)

మహిళల్లో జాడలేని అక్షర వెలుగులు

జిల్లాలో ఉండే నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అక్టోబర్‌లో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం మొదట్లో ఒక సమావేశం నిర్వహించి ఆయా శాఖ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో ఉల్లాస్ కార్యక్రమం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, సామాజిక, డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు తరగతులు నిర్వహించాల్సి ఉంది. బ్యాంకు ఖాతాలున్న వారికి వాటి నిర్వహణ తీరుపై అవగాహన కల్పించడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయిలో అమలు తీరు సరిగ్గా లేకపోవడంతో మహిళల్లో అక్షర వెలుగుల జాడ కానరాలేదు. ఇకనైనా అధికారులు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాత్రి బడుల్లో బోధించాల్సిన అంశాలు

జిల్లాలో నిర్వహించే ఉల్లాస్ కార్యక్రమం రాత్రి బడుల్లో కుటుంబం- ఇరుగు పొరుగు, మన ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత- ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లల పెంపకం- మన బాధ్యత, చట్టాలు తెలుసుకుందాం, మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలతోపాటు తెలుగు భాషను అనర్గళంగా చదవగలగడం, రాయడం, నిత్య జీవితంలో ఉపయోగపడే నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ అన్ని రకాల అంశాలకు సంబంధించి ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించి నిరక్షరాస్యులకు అందజేయాల్సి ఉంటుంది.

ఉల్లాస్ అంటే ఏంది?



ఉల్లాస్ అంటే ఏంది. అదేందో మాకు తెలియదు. మాకు ఎవరూ ఇంత వరకు సెప్పనేలేదు. నువ్వేందో కొత్తగా సెబుతున్నావే. అసలు దాని వల్ల మాకొచ్చిన ఉపయోగమేంది? మాకు ఎవరైనా అధికారులు వచ్చి సెబితే కదా తెలుసుకునేకవుతుంది.
– హైమావతి, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం

నేర్పిత్తే మంచిదే కదా!



అక్షరం ముక్కలు నేర్పిత్తే మంచిదే కదా. డబ్బులేసేందుకు బ్యాంకుకు వెళ్తే సదువొచ్చినోళ్లని అడుక్కోవాల్సిన పరిస్థితి. అక్కడున్న బ్యాంకోళ్లను అడిగితేనేమో వారు చిర్రుమంటున్నారు. మాకు బ్యాంకులో డబ్బు జమ చేసేదెట్లో నేర్పించాలి.
– వసంతమ్మ, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం

వాలంటీర్లు ఉంటే చెప్పేవారు



ఉల్లాస్ కార్యక్రమం గురించి ఎవ్వరూ ఇంత వరకు మాకు చెప్పలేదు. ముందు వాలంటీర్లు ఉండే వాళ్లు. వాళ్ల ప్రభుత్వం ఏమి అమలు చేసినా వెంటనే మాకు చెప్పేవారు. ఇప్పుడు వాలంటీర్లు లేరు కదా. అధికారులొచ్చి మాకు ఇప్పుడు చెబుతారా?
– రేఖ, తయ్యూరు, శ్రీరంగరాజపురం

అదేందో నాకు తెలీదు



అదేందో నాకు తెలీదు. పొట్ట నింపుకోవడానికి రోజూ కూలీ పనులు చేసుకోవడం మాత్రమే నాకు తెలుసు. ఇట్లాంటివి నాకు అస్సలు తెలీదు. ఇదేందో నువ్వు కొత్తగా సెబుతున్నావు. ఆ రోజుల్లో చదువుకోలేదు. ఇప్పుడు నేర్పిత్తే మంచిదే కదా.
– విజయ, పాలసముద్రం మండలం

న్యూస్‌రీల్

29న ఆయుర్వేద వైద్య శిబిరం

కాణిపాకం: వరసిద్ధుని క్షేత్రంలో ఈ నెల 29న ఉచితంగా ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. కాణిపాకంలోని ఆస్థాన మండపంలో ఈ క్యాంపును ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ శిబిరాన్ని భక్తులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

డిజిటల్ హెల్త్ మిషన్‌పై దృష్టి సారించాలి


అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై అధికారులు దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓపీ సేవలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్‌లో నమోదు కావాలని చెప్పారు. వాటిలో ప్రజల ఆరోగ్య వివరాలను కూడా నమోదు చేయించాలని సూచించారు. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పీఎఫ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ


వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సీఈఓ, చిత్రంలో వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా జెడ్పీ ఉద్యోగుల పీఎఫ్ వెబ్‌సైట్‌ను సోమవారం సీఈఓ రవికుమార్‌నాయుడు ప్రారంభించారు. జెడ్పీ కార్యాలయంలో సోమవారం సీఈఓ మాట్లాడారు. గతంలో ఉన్న వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేసినట్లు పేర్కొన్నారు. www.zppfctr.com లో ఉద్యోగులు లాగిన్ అయి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. వీటిలో ఏదైనా పొరబాట్లు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 2021 మార్చి వరకు వివరాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. త్వరలో 2024 మార్చి వరకు వివరాలను సైట్‌లో ఉంచుతామన్నారు. అనంతరం వెబ్‌సైట్ అంశాల పై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకాంత్, ఎస్టీయూ నాయకులు రమణ, మదన్‌మోహన్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

పరిశోధన ప్రదర్శనపై వర్క్‌షాప్

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో సోమవారం పరిశోధన ప్రదర్శనపై వర్క్‌షాప్ నిర్వహించారు. అధ్యాపకులు సేతురామన్, వైద్యులు షానీ, మహేంద్రనాథ్ మాట్లాడుతూ విద్యాబోధనలో పరిశోధన అత్యంత ముఖ్యమైనదన్నారు. చేసే ప్రయోగాలను మూలన పడేయకుండా వాటి ప్రదర్శనపై దృష్టి సారించాలని సూచించారు. అలాంటప్పుడే పరిశోధన ఫలిస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం పరిశోధన ప్రదర్శనపై ప్రయోగాత్మకంగా వివరించారు.

నేడు స్కూళ్లకు ఆప్షనల్ సెలవు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ మంగళవారం ఆప్షనల్ సెలవును ప్రకటిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. క్రిస్మస్ ఈవ్ సందర్భంగా పాఠశాలలకు ఆప్షనల్ సెలవు ప్రకటించినట్లు తెలిపారు. తప్పనిసరిగా అన్ని పాఠశాలలు సెలవు ప్రకటించాలని డీఈఓ ఆదేశించారు.

మొర ఆలకించండి.. న్యాయం చేయండి

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి
- పలు శాఖలకు సంబంధించి 178 అర్జీల నమోదు

చిత్తూరు కలెక్టరేట్ : మా మొర ఆలకించి.. సమస్యలు పరిష్కరించండి సారూ అంటూ పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికారులకు వినతులు అందజేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించి 178 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు. పలు శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


కలెక్టర్‌కు సమస్యలు విన్నవించుకుంటున్న ప్రజలు

గోకులం షెడ్లు మంజూరు చేయండి



గోకులం షెడ్లు మంజూరు చేయాలని పూతలపట్టు మండలం వడ్డేపల్లి పంచాయతీ శేషాపురం ఎస్టీ కాలనీకి చెందిన బుజ్జమ్మ, మౌనిక కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గోకులం షెడ్డు కోసం మండల అధికారుల వద్దకు వెళ్తే ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారం, పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఈ షెడ్లు మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీలైనా తమకు గోకులం షెడ్లు మంజూరు చేయాలని కోరారు.

దారి లేక ఇబ్బందులు



దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చిత్తూరు రూరల్ మండలం జరిమడుగు యానాది కాలనీకి చెందిన రత్నం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తమ కాలనీకి దారి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండల అధికారులకు సమస్య చెప్పినా ఫలితం లేదన్నారు. దారి సమస్య పరిష్కరించి ఇంటి పట్టాలు మంజూరు చేసి గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ కాలనీవాసులు పాల్గొన్నారు.

తాగునీటికి అష్టకష్టాలు



తాగునీటి కోసం అష్టకష్టాలు ఎదుర్కొంటున్నట్లు గంగాధరనెల్లూరు నియోజకవర్గం వేపంజేరి పంచాయతీ చిన్నారెడ్డిపల్లె ఎస్టీ కాలనీవాసులు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ కాలనీవాసులు రమణప్ప, శ్రీనివాసులు మాట్లాడుతూ చాలా రోజులుగా తమ కాలనీలో తాగునీరు లేక అవస్థలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. మండల అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో డీకేటీ స్థలంలో బోరు వేశారని, ఓ వ్యక్తి ఆ స్థలాన్ని ఆక్రమించి తమకు నీరు లేకుండా చేస్తున్నట్లు వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

జోగివారిపల్లె పేరునే కొనసాగించాలి



తమ గ్రామం పేరును జోగివారిపల్లెగానే కొనసాగించాలని ఆ గ్రామస్తులు వెంకటయ్య తదితరులు కోరారు. ఈ మేరకు తవణంపల్లె మండలం జోగివారిపల్లె గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు తమ గ్రామం పేరును మార్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. అధికారులు విచారించి తమ గ్రామం పేరును మార్చకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

జనవరి 22 నుంచి
నాక్ బృందం పర్యటన



కుప్పం: ద్రావిడ వర్సిటీలో నాక్ బృందం జనవరి 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈ మేరకు సోమవారం న్యాక్ కార్యాలయం నుంచి వర్సిటీ అధికారులకు సమాచారం అందింది. ఇదివరకే 2018లో వర్సిటీ నాక్ 'బి' గ్రేడును సాధించింది. తాజాగా నాక్ గ్రేడింగ్ కోసం ద్రవిడ వర్సిటీ అధికారులు నాక్‌కు వర్సిటీ ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్టు)ను సమర్పించారు. ఇప్పటికే వర్సిటీలో భవనాలకు పెయింటింగ్, కొత్త బోర్డులు, హోర్డింగులతో పాటు వర్సిటీని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సారైనా వర్సిటీకి 'ఏ' గ్రేడును సాధిస్తే, అభివృద్ధి పథంలో నడుస్తుందని వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ఆశిస్తున్నారు.

సెలవుల్లేవ్

జనవరిలో నాక్ బృందం పర్యటన ఉన్నందున వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది ఎలాంటి సెలవులు పెట్టకూడదని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీ భవితవ్యం నాక్ గ్రేడింగుపై ఆధారపడి ఉన్నందున కేవలం సంక్రాంతి సెలవులు మాత్రమే తీసుకోవచ్చని చెప్పారు. అలా కాకుండా మరొక్క రోజు కూడా అదనంగా సెలవులు పెట్టకూడదని స్పష్టం చేశారు. వర్సిటీకి నాక్ 'ఏ' గ్రేడును సాధించేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి కష్టపడాలని సూచించారు.

క్రిస్మస్ హై టీ


కలెక్టరేట్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే థామస్, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారికంగా క్రిస్మస్ హైటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మైనారిటీలకు సంక్షేమ భవనం ఏర్పాటు చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను తాము పాఠశాల స్థాయిలోనే జరుపుకునే వారమని తెలిపారు. మైనారిటీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సంతోషానికి ప్రతీకగా క్రిస్మస్ ట్రీని ప్రారంభించి కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్మన్ హేమలత, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యంగా ఉండొద్దు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశించారు. చిత్తూరులోని పోలీసు ఆర్మ్డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ రాజశేఖర్ రాజు, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. మొత్తం 28 ఫిర్యాదులు రాగా, ఇందులో పోలీసుల సమస్యలు, కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు, భూములు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఎస్పీ ఆదేశించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు.

క్లుప్తంగా

కౌన్సెలింగ్‌లో గందరగోళం



నిరీక్షిస్తున్న మహిళా ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాలోని నగరపాలక, మున్సిపల్ పాఠశాలల్లో ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉద్యోగోన్నతుల ప్రక్రియ గందరగోళంగా మారింది. చిత్తూరు డీఈవో కార్యాలయంలో సోమవారం ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఒకే రోజు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహించడంతో సమస్యలు తలెత్తాయి. కౌన్సెలింగ్ కోసం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి పలువురు ఉపాధ్యాయులు విచ్చేశారు. మహిళా ఉపాధ్యాయులు సైతం రాత్రి 9 గంటల వరకు పడిగాపులు కాశారు. సీనియారిటీ జాబితాలో గందరగోళం తలెత్తడంతో కౌన్సెలింగ్ ఆగిపోయిందని అధికారులు వెల్లడించారు. తిరిగి కౌన్సెలింగ్ మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించడంతో టీచర్లు ఆయా ప్రాంతాలకు వెనుదిరిగారు. కౌన్సెలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాల్సిన విద్యాశాఖ అధికారులు అలసత్వం వహించడంపై అయ్యోర్లు గుర్రుమన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించిన గురుస్వామి



రొంపిచెర్ల: మండలంలోని వారణాసివారిపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు గురుస్వామి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. ఆయన తిరుపతి జిల్లాలోని ఎంజీఎం సీహెచ్ కార్పొరేషన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. పాఠశాలలో విద్యాబోధన చేస్తూనే తెలుగు సాహిత్యంలో పద్య, గీతాలు, జానపద గేయాలు పాడుతుంటారు. రంగస్థలం వేదికగా వివిధ రకాల పాత్రలను పోషిస్తూ తెలుగు సాహిత్యానికి, తెలుగు సంస్కృతికి, తెలుగు భాష ఔన్నత్యానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఐఎస్‌వో సంస్థ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ అవార్డును విజయవాడలోని జిల్లా గ్రంథాలయ ప్రాంగణంలోని కన్వెన్షనల్ హాల్‌లో ఆదివారం అందించారు. ఐఎస్‌వో ప్రెసిడెంట్ మాదుగుల రత్నకుమారి, చైర్మన్ డాక్టర్ యూవీ రత్నం, జాతీయ కన్వీనర్ ఉషారాణి తదితరులు గురుస్వామిని తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.

దుకాణం దివాలా!

ఐటీ ఉద్యోగాలకంటే.. సొంతంగా రోడ్డు పక్కన చిన్న హోటల్ పెట్టుకుంటే బతికిపోవచ్చనే రోజులు కనుమరుగవుతున్నాయి. ఏ వ్యాపారం చేద్దామన్నా మార్కెట్‌లో స్తబ్దత నెలకొంది. పండుగలు, పబ్బాలు వస్తే తప్ప జనం కొనుగోళ్లపై ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం ప్రజలు ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో నిర్మాణ రంగంతో పాటు రియల్ ఎస్టేట్, వస్త్రాల దుకాణాలు, బులియన్ వ్యాపారులు ఖాళీగా కూర్చునే పరిస్థితి. ఇదేమిటని అడిగితే.. 'అసలు జనం వద్ద డబ్బులుంటే కదా. ఏదో గవర్నమెంటు స్కీమ్ వస్తే, ఆ డబ్బు రొటేషన్ అయ్యేది. ఇపుడు అలా లేదు కదా..' అనే సమాధానం. దుకాణాలన్నీ క్రమంగా దివాలా వైపు నడుస్తున్నాయి. వ్యాపారులకు ఏం చేయాలో దిక్కుతోచక అయోమయంలో కూరుకుపోయారు.



- ఎక్కడికక్కడే స్తంభించిన వ్యాపారాలు
- పెరిగిన ధరలతో పడిపోయిన కొనుగోళ్లు
- నిర్మాణ, వస్త్ర, బులియన్ మార్కెట్లలో స్తబ్దత
- సంక్షేమ పథకాల్లేక రొటేషన్‌కాని నగదు
- అవసరమైతేనే కొనుగోళ్లపై ప్రజల ఆసక్తి

చిత్తూరు కార్పొరేషన్/చిత్తూరు అర్బన్: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న చిత్తూరు జిల్లాలో ఏ వ్యాపారం చేసినా కొద్దోగొప్పో లాభాలను తెచ్చిపెడుతుంది. కానీ ఇటీవల ఏ ఒక్క వ్యాపారిని కదిలించినా.. 'వ్యాపారమే లేదబ్బా' అనే నిట్టూర్పు వినిపిస్తోంది. జిల్లాకు ప్రత్యేకంగా ఉన్న నిత్యవసరాలు, వంట నూనెలు, సిమెంటు, స్టీల్, పెయింట్స్, టెక్స్‌టైల్స్, గ్రానైట్స్, జువెలరీస్ వ్యాపారాలు గత ఆర్నెళ్లుగా ముందుకు కదలడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు డబ్బులు చేరుతుండేది. దీన్ని మార్కెట్‌లో ఏదో ఒక వస్తువు కొనడం, అమ్మడం చేయడంతో డబ్బులనేది రొటేషన్ అయ్యేది. ఇది ప్రత్యక్షంగా వ్యాపారికి లాభం తెచ్చి పెట్టడంతో పాటు పరోక్షంగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయాన్ని తెచ్చిపెడుతుండేది. కానీ ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల వేళ నుంచి జిల్లాలో పెద్దగా వ్యాపారాలు జరగలేదు. ఎన్నికల ఫలితాల అనంతరం సైతం అదే పరిస్థితి. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెళ్లవుతున్నా పరిస్థితిలో మార్పు కనిపించడంలేదు.

ప్రభుత్వానికే ఆదాయం లేదు

జిల్లాలో జీఎస్టీ లైసెన్సు ఉన్న వ్యాపారులు దాదాపు 39వేల మంది వరకు ఉన్నారు. జీఎస్టీ పరిధిలోకి రాని వ్యాపారులు దాదాపు 80 వేల మంది ఉన్నట్లు అంచనా. కేవలం లైసెన్సులు ఉన్న వ్యాపారుల నుంచి గత ఆర్థిక సంవత్సరం జిల్లాకు జీఎస్టీ ద్వారా రూ.1,318 కోట్లు పన్నుల రూపంలో ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల లక్ష్యం రూ.1800 కోట్లు.. కానీ నవంబర్ వరకు పన్నుల రూపంలో దాదాపు రూ.950 కోట్లు మాత్రమే వసూలైంది. అంటే మరో నాలుగు నెలల్లో రూ.950 కోట్లు సాధ్యమేనా..? అంటే అధికారులు సైతం నేల చూపులు చూస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని చూస్తే గతేడాది జిల్లాలో రోజు సగటున 300 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 150 కూడా దాటడంలేదు. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు లాంటి పట్టణాల్లో రియల్ ఎస్టేట్ భూమ్ బాగా పడిపోయింది. ఇక కుప్పం, నగరి, గంగాధరనెల్లూరు ప్రాంతాల్లో 10 శాతం కూడా పురోగతి కనిపించడంలేదు. నిర్మాణ రంగానికి అనుబంధంగా ఉన్న ఎలక్ట్రీషియన్, ఫర్నిచర్, ప్లంబింగ్ అమ్మకాలు పడిపోయాయి. రోజుకు 10 లక్షల బస్తాల సిమెంటు, 2 వేల టన్నులు స్టీల్ అమ్మకాలు జరుగుతుంటే ఆ స్థాయి వ్యాపారం ఇపుడు లేదు. ప్రస్తుతం బస్తా సిమెంట్‌పై రూ.35 వరకు తగ్గినా.. అమ్మకాలు సగానికిపైగా జరగడంలేదు. ఇక టీవీ, ఏసీ, వాషింగ్ మెషీన్లు, ఫ్రిడ్జ్, మిక్సీ, హార్డ్‌వేర్, స్టీల్ సామగ్రి వ్యాపారాలు బాగా తగ్గిపోయాయి.

మార్కెట్లన్నీ కుదేలు!

- గతంలో ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం రూపంలో ప్రజలకు నెలానెలా లబ్ధి చేకూరేది. దీంతో డబ్బులు చేతులు మారుతుండడంతో దుకాణాలు కళకళలాడేవి. ప్రసుత్తం ఆ పరిస్థితి లేదు. ఆర్నెళ్లుగా ప్రజలకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా చిల్లిగవ్వ అందకపోవడంతో నిత్యవసరాల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. కూరగాయలు ముట్టుకునే పరిస్థితి లేదు. ఇక తప్పనిసరిగా తినాలి కాబట్టి.. నిత్యావసర వస్తువుల ధరలు ఎంత పెరిగినా ప్రజలు వీటిని కొంటున్నారు.
- చిత్తూరుకు పేరున్న పంటల్లో చెరకు ప్రధానం. ప్రస్తుతం చెరకు పంట సాగు చేసే రైతులను వేళ్లపై లెక్కించే పరిస్థితి. ఫలితంగా బెల్లం ఎగుమతులు పడిపోయాయి. వేసిన పంటలో కూడా 30 శాతం మాత్రమే చేతికి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం అందక.. చేతిలో డబ్బుల్లేక వేరుశనగ, చెరకు, వరి లాంటి పంటలవైపు రైతులు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించడంలేదు.
- హోల్‌సేల్ నిత్యావసరాల దుకాణాలు 500 వరకు ఉన్న జిల్లాలో.. ఒక్క రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అమ్మకాలు జరిగేవి. కానీ ఇపుడా పరిస్థితి లేదు. పెరిగిన నిత్యావసర ధరల కారణంగా పండుగ వేళ మాత్రమే రూ.3 లక్షల అమ్మకాలు జరుగుతున్నాయి.
- వంట నూనె హోల్‌సేల్ దుకాణాలు 30 వరకు ఉంటే, గతంలో రోజు రూ.60 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుండగా ప్రస్తుతం రూ.20 లక్షలకు పడిపోయింది.
- జిల్లాలో రోజుకు రూ.10 కోట్లకు పైగా జరుగుతున్న బులియన్ (బంగారం, వెండి దుకాణాలు) వ్యాపారం పూర్తిగా పడిపోయింది. రోజురోజుకూ పెరుగుతున్న బంగారం, వెండి ధరల కారణంగా ఇపుడు రోజుకు రూ.6 కోట్ల వ్యాపారం మాత్రమే జరుగుతోందని ట్రేడర్లు చెబుతున్నారు.
- చిత్తూరు జిల్లాకు గ్రానైట్ పరిశ్రమ పెట్టింది పేరు. ఒకప్పుడు నిండుకుండలా ఉన్న వ్యాపారం ప్రస్తుతం దివాలా స్థితికి చేరింది. జిల్లాలో 500కు పైగా ఫ్యాక్టరీలు ఉంటే రోజూ ప్రతి దుకాణం రూ.2 లక్షలకు పైగా దాదాపు వ్యాపారం జరిగేది. ప్రస్తుతం అందులో సగం వ్యాపారం జరిగితే చాలు పండుగలా మారింది.
- రెడీమేడ్ దుకాణాలు జిల్లాలో వెయ్యి వరకు ఉన్నాయి. అన్ని దుకాణాలు కలిపి రోజుకు రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతుంటే, ప్రస్తుతం రూ.40 లక్షల వరకు వ్యాపారాలు జరిగితే అదే గొప్పగా అనుకుంటున్నారు.

నూనె వ్యాపారం పోయింది



కస్టమ్ డ్యూటీ పెంచడంతో నూనె ధరలు ప్యాకెట్ మీద రూ.35 వరకు పెరిగాయి. గతంలో కంటే ప్రస్తుతం వ్యాపారం తగ్గింది. చిత్తూరులో 6 హోల్‌సేల్ నూనె దుకాణాలు ఉన్నాయి. ఒక దుకాణం పరంగా రోజు రూ.2 లక్షల వరకు వ్యాపారం జరిగేది. ధరలు పెరగడంతో మూడునెలలుగా 30 శాతానికి పైగా వ్యాపారం తగ్గింది.

- సునీల్, నూనె ప్యాకెట్ల వ్యాపారి, చిత్తూరు

ఖాళీగా ఉన్నాం..



గతంలో పండుగలకు సంబంధం లేకుండా నగలు కొనేవారు. ఇప్పుడు ముహూర్తాలు, పండుగల సమయంలో కొనుగోలు అంతంతమాత్రంగానే ఉంది. బంగారం కాదు పలు రంగాల్లో అమ్మకాలు సజావుగా సాగడం లేదు. జనం దగ్గర డబ్బులు లేకపోవడంతో దుకాణాల్లో అడుగుపెట్టడం లేదు. గతంలో జిల్లాలో రోజు రూ.10 కోట్ల టర్నోవర్ జరిగేది. ప్రస్తుతం రూ.5 కోట్లు జరగడమే కష్టంగా ఉంది.

- రవి, జిల్లా ఉపాధ్యక్షుడు, జ్యువెలర్స్, పాన్‌బ్రోకర్స్ సంఘం, చిత్తూరు

గ్రానైట్ నిర్వీర్యం



నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులతో గ్రానైట్ రంగం నిర్వీర్యం అయింది. గతంలో వెలుగు వెలిగిన పరిశ్రమ ఇప్పుడు మూత దిశగా పరుగులు పెడుతున్నది. చిన్న ఆర్డర్ల కోసం యజమానులు వేచి చూసే పరిస్థితి ఏర్పడింది. గ్రానైట్ రాయి కొనుగోలు, లైయింగ్‌తో పోలిస్తే టైల్స్ తక్కువ. దీనికి తోడు గ్రానైట్ పరిశ్రమ నిర్వహణ భారంగా మారింది. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి.

- కృష్ణారెడ్డి, యజమాని, గ్రానైట్ పరిశ్రమ చిత్తూరు

సిమెంటు వ్యాపారాల్లేవు



ఇళ్ల నిర్మాణాలు, ఇతర పనులు జరుగుతున్నప్పుడు సిమెంటు వ్యాపారం బాగా జరిగేది. ప్రస్తుతం నిర్మాణాలు తగ్గాయి. పోటీ ఎక్కువ అవడంతో ఎక్కడైనా ఇల్లు కడుతుంటే వారితో అమ్మకాల కోసం సంప్రదింపులు జరిగే పరిస్థితి ఏర్పడింది. స్టీల్ ధరల్లో పెద్ద వ్యత్యాసం లేకపోయినా అమ్మకాలు లేక స్తబ్దంగా ఉంది. ఇక ముందు అయినా నిర్మాణాలు పెరిగితే వ్యాపారం బాగుంటుంది.

- రవి, సిమెంటు వ్యాపారి చిత్తూరు

వెలిసిపోయిన రంగులు



భవన నిర్మాణం పూర్తయ్యాక చివరిలో కళ కోసం రంగులు వేస్తారు. కానీ ప్రస్తుతం నిర్మాణాలు పెద్దగా లేకపోవడంతో పెయింట్ వ్యాపారమే వెలిసిపోయినట్టయ్యింది. గతంలో నిర్మాణాలు బాగా జరిగేవి పట్టి, ప్రైమర్, ఇన్నర్, అవుటర్, ఎలివేషన్ పెయింట్స్ అమ్మకాలు బాగా జరిగేవి. వీటితో పాటు పనిముట్ల విక్రయాలు సపోర్ట్‌గా ఉండేది. ఇప్పుడు దుకాణాల వైపు ఎవరూ రావడం లేదు.

- జవహర్‌రెడ్డి, పెయింట్ డీలర్, చిత్తూరు

కొనేవాళ్లెక్కడ?



ఒకప్పుడు మామూలు రోజుల్లోనే బట్టలంగడి జనంతో కలకళలాడేది. ఇపుడు జనాలు పండుగలకు కూడా ఇటు వైపు పెద్దగా రావడం లేదు. మొన్న జరిగిన దీపావళి పండుగకు కూడ గల్లా నిండలేదంటే పరిస్థితి మీరే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం డబ్బులు పెద్దగా రొటేషన్ కావడం లేదు. దీంతో బట్టల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. అసలు కొనేవారే కంటికి కనిపించడం లేదు.

- వెంకటేష్, యజమాని, రెడీమేడ్ దుకాణం, చిత్తూరు

తగ్గిన బెల్లం అమ్మకాలు



బెల్లం వ్యాపారం గత 6 నెలలుగా ఆశించిన స్థాయిలో లేదు. జిల్లాలో 80కు పైగా బెల్లం హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. గతంలో రోజుకు దాదాపు రూ.30 లక్షల వరకు వ్యాపారం జరిగేది. ప్రస్తుతం పంట దిగుబడి తగ్గడంతో 30 శాతం వరకు అమ్మకాలు తగ్గింది. పెరిగిన నిత్యవసరధరలతో పాటు కూలీ రేట్లు బాగా పెరిగాయి. దీంతో పంట వేయడం తగ్గించారు.

- నవీన్, బెల్లం వ్యాపారి, చిత్తూరు నగరం

ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు జైలు

చిత్తూరు అర్బన్: నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని మూడో ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాసులు సోమవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు 2022 నవంబర్ 19న చిత్తూరు మండలంలోని అనుప్పల్లె సమీపంలో ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఆ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి తాలూక ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. చిత్తూరులోని మంగసముద్రం హౌసింగ్ కాలనీకు చెందిన ఆటో డ్రైవర్ ఎస్.నీలకంఠన్ (58)పై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

శ్రీకాకుళం నుంచి చెన్నైకి గంజాయి..



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుత్తూరు: శ్రీకాకుళం జిల్లా నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన సోమవారం తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పున్నమి హోటల్ వద్ద డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి సమక్షంలో సీఐ సురేంద్రనాయుడు బృందం తనిఖీలు చేపట్టింది. బస్సులో నుంచి అనుమానాస్పదంగా దిగిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వీరి వద్ద రెండు బ్యాగుల్లో 17కిలోల గంజాయిని గుర్తించి అరెస్ట్ చేశారు. పట్టుబడినవారిలో తిరువళ్లూరు జిల్లాకు చెందిన ఎం.ప్రభాకర్(25), తిరుపూర్ జిల్లాకు చెందిన సి.మణి మేఘాలయి(35) ఉన్నారు. వీరు శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వే స్టేషన్ వద్ద గంజాయి బ్యాగులను తీసుకొని చెన్నైకి తరలిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.2.55 లక్షలుగా లెక్క గట్టారు. పోలీస్ సిబ్బంది రవి, రామమూర్తి, ఏకాంబరం, బాలకృష్ణ, యమున పాల్గొన్నారు.

చౌడేపల్లెలో తెలంగాణ పోలీసులు

చౌడేపల్లె: బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌కె రమణారెడ్డి హైదరాబాదులోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు సోమవారం చౌడేపల్లె పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మండలంలోని దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట పంచాయతీలకు చెందిన ఐదుగురు యువకులు ఫోన్‌చేసి రమణారెడ్డిని దూషించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని 41 ఏ నోటీసులు జారీచేసి పూచీకత్తుతో పంపినట్లు ఇక్కడి పోలీసులు తెలిపారు.

భార్య వివాహేతర సంబంధం.. భర్త ఆత్మహత్య



మోహనాచారి (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): భార్య అక్రమ సంబంధం జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఉద్యాణంపల్లెలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఉద్యాణంపల్లెకు చెందిన రవి ఆచారి కుమారుడు మోహన్ ఆచారి(36) కి పాకాల మండలం గాదంకి గ్రామానికి చెందిన సరితతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా సరిత సచివాలయ ఉద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో 50 రోజులుగా ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. అయితే ఆ ప్రభుత్వ ఉద్యోగితోనే ఉంటానంటూ భార్య తేల్చి చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన మోహన్‌ఆచారి సోమవా రం సెల్ఫీ వీడియో తీసి గ్రామస్తులకు తమ గోడు వెళ్లబోసుకున్నాడు. దీంతో ఉదయం ఆ వీడియో చూసిన గ్రాస్తులకు మోహన్ ఆచారి కనిపించక పోవడంతో వెతకడం మొదలు పెట్టారు. గ్రామానికి సమీపంలోని ఓ క్వారీపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీలో చేరాల్సిన ఖర్మ మాకేంటి?



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజేయులురెడ్డి

వెదురుకుప్పం: టీడీపీలో చేరాల్సిన ఖర్మ తమకు పట్టలేదని మండలంలోని నల్లవెంగనపల్లె ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజేయులురెడ్డి స్పష్టం చేశారు. వారు సోమవారం వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ, గత కొంత కాలంగా పార్టీలో చిన్న చిన్న మనస్పర్థల కారణంగా పార్టీ పదవికి రాజీనామా, ఎంపీటీసీ పదవి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అయితే ఈ విషయాన్ని కొందరు సోషల్ మీడియాలో టీడీపీలో చేరుతున్నట్లు తమపై దుష్ప్రచారం చేసినట్లు మండిపడ్డారు. తనకు గుర్తింపునిచ్చిన పార్టీని వదిలి వేరే పార్టీలో చేరాల్సిన గత్యంతరం తమకులేదన్నారు. విషయం తెలియగానే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, విజయానందరెడ్డితో పాటు యువ నాయకుడు అభినయ్ రెడ్డి తనతో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలుసుకున్నారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిని సోమవారం కలిసినట్లు చెప్పారు. తాము టీడీపీలో చేరతామన్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి, వైఎస్సార్ కుటుంబంపై ప్రజల్లో ఉన్న అభిమానం ఎప్పటికీ చెరిగిపోదన్నారు.

పుష్పకు పుడమి పుత్ర అవార్డు



అవార్డు అందుకుంటున్న పుచ్చున పుష్ప

పాలసముద్రం : మండల పరిధిలోని శ్రీకావేరిరాజుపురానికి చెందిన పుచ్చున పుష్పకు పుడమిపుత్ర అవార్డు అందుకున్నారు. యాదగిరిగుట్టలో జరిగిన జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సుల్లో మండలానికి చెందిన పుచ్చున పుష్ప ఈ అవార్డు అందుకున్నారు.

గోకులం.. పసుపుమయం



గుడుపల్లె మండలం కనమనపల్లె వద్ద నిర్మించిన గోకులం షెడ్డు

- టీడీపీ నాయకులు చెప్పిన వారికే షెడ్లు మంజూరు
- సామాన్య రైతులకు మొండిచేయి
- ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం
- షెడ్లు అన్నింటికీ టీడీపీ రంగులు

కుప్పం: పాడిపరిశ్రమ అభివృద్ధిలో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన గోకులం షెడ్లన్నీ చిత్తూరు జిల్లాలో పసుపుమయంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం షెడ్లు మంజూరు చేసింది. జాతీయ మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసి రైతులకు షెడ్ల నిర్మాణం సాగించింది. ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మించి, అధికార పార్టీకి చెందిన పసుపురంగు వేసుకుంది. టీడీపీ నాయకులు చెప్పిన వారికే ఈ షెడ్లు మంజూరు చేస్తున్నారు. సామాన్యులకు యథాప్రకారం మొండి చేయి చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. మరోవైపు మంజూరుచేసిన షెడ్లకు అన్నింటికీ పసుపు రంగు వేస్తున్నారు.

షెడ్ల నిర్మాణం ఇలా...

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఐదు క్లస్టర్లకు గాను 2,476 గోకులం షెడ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికి గాను 53.9 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ షెడ్లకు సంబంధిత వినియోగదారుడు 10 శాతం నగదును చెల్లించినట్లైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణంలో ఉన్న షెడ్లను బట్టి నగదును విడుదల చేస్తారు. రెండు పశువులకు రూ.1.40 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.80 లక్షలు ఆరు పశువులకు రూ.2.30 లక్షలు చొప్పున ప్రభుత్వం కేటాయించింది. దీని ప్రకారం పునాదుల నిర్మాణం నుంచి షెడ్లు పూర్తయ్యే వరకు దశల వారీగా నిధులు సంబంధిత రైతులకు మంజూరవుతాయి.

పక్కదారి పడుతున్న నిధులు

కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఉపాధి కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులను కల్పిస్తోంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం షెడ్ల నిర్మాణంలో పునాదుల తవ్వకాలు, మట్టి పనులను కూలీ ద్వారా చేపట్టాల్సి ఉంది. జేసీబీ యంత్రాలతో పునాదులు తవ్వుకుని కూలీలకు ఉపాధి కల్పించడం లేదని ఆరోపణలున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పూర్తి నగదులో 10 శాతం సంబంధిత రైతు చెల్లించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా 10 శాతం నగదు ప్రభుత్వానికి చెల్లించిన దాఖలాలు లేవు. అధికార పార్టీ నేతలు నిధులను దారిమళ్లించి ఇష్టానుసారంగా గోకులం షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు.

క్లస్టర్ వారీగా షెడ్లు మంజూరు

చిత్తూరు జిల్లాలో ఐదు క్లస్టర్లుగా విభజించి గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

క్లస్టర్ పేరు	నిధులు	మంజూరైన షెడ్లు
చిత్తూరు	రూ.8.79 కోట్లు	380
కుప్పం	రూ.15.18 కోట్లు	689
నగరి	రూ.8.9 కోట్లు	384
పుంగనూరు	రూ.12.01 కోట్లు	549
సదుం	రూ.10.43 కోట్లు	474

టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే మంజూరు

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు గోకులం పేరిట గత ప్రభుత్వం షెడ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆరు నెలల క్రితం రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించింది. సామాన్య రైతులకు అందివ్వాల్సిన గోకులం షెడ్లు టీడీపీ నేతలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లో టీడీపీ నేతలు చెప్పిన వారికే మొదటి విడతగా షెడ్లు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా సామాన్యుడు షెడ్డు కోసం వెళ్తే గ్రామాల్లో బూత్ కన్వీనర్, క్లస్టర్ ఇన్‌చార్జ్, అధికార పార్టీ పంచాయతీ అధ్యక్షుడు సిఫారసు చేస్తే తప్ప షెడ్లు మంజూరు చేయరు. ఈ ప్రక్రియలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నేతలకే గోకులం షెడ్లు మంజూరయ్యాయి. దీంతో పూర్తయిన షెడ్లు పసుపుమయంగా మారిపోయింది. ఉపాధిహామీ పథకం బోర్డును సైతం పసుపు రంగులో మార్చి సంబంధిత సమాచారం నమోదు చేయడం గమనార్హం.